క్లుప్తంగా

నేడు కామాక్షితాయి ఆలయ మూసివేత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయాన్ని శనివారం మధ్యాహ్నం నుంచి మూసివేస్తున్నట్లు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యానాయుడు, ఈఓ గిరికృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయశుద్ధి, సంప్రోక్షణ అనంతరం స్వామి, అమ్మవారి దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించనున్నట్లు చెప్పారు.

నేడు గొలగమూడిలో మంత్రి కాకాణి పర్యటన

వెంకటాచలం: మండలంలోని గొలగమూడిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పర్యటించనున్నట్లు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు గ్రామానికి చేరుకుని జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తారని చెప్పారు. అనంతరం వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థులకు అభినందన



వెంకటాచలం: స్థానిక స్వర్ణభారత్ విద్యామందిర్‌కు చెందిన పలువురు విద్యార్థులు దసరా సెలవుల్లో ఇంటి వద్ద ఉండకుండా రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్‌ఎస్‌ఎస్) శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్ శిక్షణలో నేర్చుకున్న ప్రతిభాపాటవాలను శుక్రవారం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారిని స్వర్ణభారత్ ట్రస్ట్ సమన్వయకర్త జనార్దన్‌రాజు, అక్షయ విద్యాలయ, స్వర్ణభారత్ విద్యామందిర్ ప్రిన్సిపాల్స్ కుముదా, సులోచన తదితరులు అభినందించారు.

ఎస్‌ఈఏఎస్ సర్వేపై శిక్షణ



ముత్తుకూరు: స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(ఎస్‌ఈఏఎస్)కు మండలంలోని 43 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసినట్లు ఎంఈఓ మధుసూదన్ తెలిపారు. పిడతాపోలూరులోని డీ ఫార్మా కళాశాలలో ఎస్‌ఈఏఎస్ సర్వేపై శిక్షణా తరగతులను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ డిసెంబరు 3న ఎంపిక చేసిన 43 స్కూళ్లలో సర్వే చేపట్టాలని సూచించారు. విద్యాప్రమాణాల గుర్తింపునకు పరీక్షలు ఎలా నిర్వహించాలన్న అంశంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓ హేమసుందరరావు, ప్రిన్సిపల్ ప్రపూర్ణచంద్ర, రిసోర్స్‌పర్సన్ రజనీకర్ పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయానికి నగదు విరాళం



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయానికి మన్నెం శ్యాంప్రసాద్,లక్ష్మి దంపతులు రూ.50 వేల నగదు విరాళాన్ని శుక్రవారం అందజేశారు. ఆలయ నిర్వాహక కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డికి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌పై అభ్యంతరాలు తెలియజేయండి



ముత్తుకూరు: ఈ-క్రాప్ నమోదుపై రైతులకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఈ నెల 29వ తేదీలోగా రైతు భరోసా కేంద్రాల్లో తెలియజేయాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ కోరారు. మండలంలోని బ్రహ్మదేవి, మల్లూరు, తాళ్లపూడి రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కోసం ఈ-క్రాప్ జాబితాలను శుక్రవారం ప్రదర్శించారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నారాణితో కలసి ఏడీఏ జాబితాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మల్లూరులో నిర్వహించిన గ్రామసభలో ఆయన ప్రసంగించారు. ఈ -క్రాప్ నమోదు ఆధారంగా పంట బీమా, పంట కొనుగోళ్లు, పంట నష్టపరిహారం అందుతాయని తెలిపారు. వీఏఏ జగదీష్, రైతులు పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష శిబిరం

ముత్తుకూరు: మండలంలోని దొరువులపాళెం సచివాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రత్యూష శుక్రవారం తెలిపారు. వైద్యనిపుణులు హాజరై వైద్యపరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. సచివాలయం పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పేదల ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్యసేవలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మెడికల్ కిట్ అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు ఇంటి వద్దే కార్పొరేట్ వైద్యసేవలను అందిస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు సచివాలయం బిట్-2 పరిధిలోని ప్రజల కోసం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరానికి మంత్రి కాకాణి సందర్శించి వైద్య, రక్త పరీక్షల నిర్వహణను పరిశీలించారు. వైద్యసేవలు అందిస్తున్న తీరును రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ 400 మంది వైద్యపరీక్షల కోసం పేర్లు నమోదు చేసుకున్నట్టు తెలిపారు. వైద్యశిబిరంలో అన్ని రకాల వైద్యసేవలను అందిస్తున్నామని తెలిపారు. కంటి వ్యాధులకు సైతం పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులను నిర్ధారించి అవసరమైతే వారికి శస్త్రచికిత్సలు చేయిస్తున్నట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పేదలకు వరమన్నారు. ఒక్కరూపాయి ఖర్చులేకుండా నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

రూ.80 లక్షలతో విద్యుత్ స్తంభాల మార్పు

ఎన్నో ఏళ్లుగా ఇళ్లపై వెళ్తున్న 33 కేవీ విద్యుత్‌లైన్లతో ప్రాణభయంతో జీవిస్తున్న పట్టణంలోని గేటుసెంటరు ప్రాంతవాసులకు ఉపశమనం కలిగించేలా విద్యుత్ స్తంభాలు, తీగలను మార్చేందుకు రూ.80 లక్షలను మంజూరు చేయించినట్టు మంత్రి కాకాణి తెలిపారు. ఈ మేరకు ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ఇచ్చిన ఉత్తర్వుల ప్రతిని మంత్రి చూపారు. ఈ పనులు పూర్తయితే గేటు సెంటరు ప్రాంతానికి చెందిన వారు నిశ్చింతగా నివాసం ఉండవచ్చన్నారు.

పేదలకు భూములు పంపిణీ చేస్తాం

మండలంలోని అర్హులైన 1,469 కుటుంబాలకు 2,300 ఎకరాల అసైన్‌మెంట్ భూములను త్వరలో అందజేయనున్నట్లు మంత్రి కాకాణి వెల్లడించారు. మండలంలో 2,062 ఎకరాల చుక్కల భూములకు శాశ్వత పరిష్కారాన్ని చూపామని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 4,605 ఎకరాల అసైన్‌మెంట్ భూములను 5,019 పట్టాలుగా మార్చి అందజేశామని చెప్పారు. అసైన్‌మెంట్ భూములు కలిగిన వారు 20 ఏళ్ల తర్వాత వాటిని అమ్ముకోవడానికి అభ్యంతరం లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా పేదలకు భూములను అందజేసి తీరుతామన్నారు. గత ప్రభుత్వంలో సోమిరెడ్డి సాగులో ఒకరు ఉంటే మరొకరికి పట్టా అందజేసి రైతుల మధ్య వివాదాలు సృష్టించారని ఆరోపించారు. ఎవరి సాగుబడిలో భూమి ఉంటుందో వారికే పట్టాలను అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలను ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. పేదలకు భూములను ఇస్తుంటే సోమిరెడ్డి కుంభకోణాలు జరిగాయని రాద్ధాంతం చేస్తున్నాడన్నారు. మంత్రి వెంట తహసీల్దార్ వీరవసంతరావు, ఎంపీడీఓ నగేష్‌కుమారి, వైద్యాధికారులు కావ్యశ్రీ, కిరణ్‌రిషిత, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, కోనం చినబ్రహ్మయ్య, పెదమల్లు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ సోమా అరుణ, ఎమ్పీటీసీ జీ.లక్ష్మీకల్యాణి, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, శేఖర్‌బాబు, శివశంకర్, సోమాభాస్కరావు, వార్డుసభ్యులు ఎస్‌కే అంజాద్, సతీష్‌కుమార్‌రెడ్డి, అనూరాధ, మూర్తిరెడ్డి, హేమంత్, ఎస్‌కే ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



వైద్యసేవలు అందిస్తున్న తీరును పరిశీలిస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సోమరాజుపల్లిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ ప్రజారోగ్యమే పరమావధిగా నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలు మార్చారని వివరించారు. దివంగత సీఎం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తే, దాని పరిధిని సీఎం వైఎస్ జగన్ విస్తరించి పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం మరో అడుగు ముందుకేసి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు ఇంటి వద్దే కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్నారని వివరించారు. ఆరోగ్యంపై ప్రజలను చైతన్యవంతం చేయాలని ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. చాలా మంది ఆరోగ్యంగా ఉన్నామని, ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవడం ఎందుకులే అని భావిస్తారని తెలిపారు. అలాంటి వారు ఆరోగ్య సురక్ష శిబిరంలో ఉచిత పరీక్షలు చేయించుకోగా ఆరోగ్య సమస్యలు బయట పడుతున్నాయన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వ వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కరోనా సమయంలో అండగా నిలిచింది ఎవరు...?

ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎప్పుడూ కనిపించని నాయకులు గ్రామాలకు వస్తున్నారని, కరోనా విలయ తాండవం చేసిన రెండేళ్లలో మీరంతా ఎక్కడ ఉన్నారని ఎమ్మెల్యే ప్రసన్న ప్రశ్నించారు. ఆ రోజు మీ మధ్యన ఎవరు ఉన్నారో ఒక్కసారి ప్రజలు గుండెల మీద చేయివేసుకుని ఆలోచించాలని కోరారు. వలంటీర్లు, సచివాలయ, వైద్యారోగ్య సిబ్బంది, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మాత్రమే ఉన్నారన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడుకోవాలని తెగించి సేవలు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2.25 లక్షల కోట్లను అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేశారని తెలిపారు. దేశంలో పేదల మీద ఇంత దృష్టిపెట్టి పెద్దఎత్తున వారి సంక్షేమానికి కృషి చేసిన వ్యక్తి మరెవరూ లేరన్నారు. ఉమ్మడి రాష్ట్రం, విభజన రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన బాబు మోసపూరిత పాలనను దుయ్యబట్టారు. ఎమ్మెల్యేలు నేరుగా గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం దేశంలో ఎక్కడా లేదని, ఆ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందని కొనియాడారు. ముఖ్యమంత్రి మనకు అండగా నిలిచారా..లేదా అని గుండెల మీద చేయివేసుకుని రాబోవు ఎన్నికల్లో ఆశీర్వదించాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీసీఎమ్మెఎస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, నిడిముసలి పీఏసీఎస్ అధ్యక్షుడు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, మాజీ జెడ్పీటీసీ బీవీ రమణయ్య, తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ నాగేంద్రబాబు, వైద్యాధికారులు శ్రావణి, విజయ్‌శంకర్, నాయకులు షబ్బీర్, ఎంపీటీసీ వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి చూపాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ అంకమరావు

వెంకటాచలం: గ్రామీణ ప్రాంత యువత చెడు అలవాట్ల వైపు వెళ్లకుండా క్రీడలపై ఆసక్తి చూపాలని సీఐ అంకమరావు అన్నారు. స్థానిక ఇందిరమ్మకాలనీ వద్ద వెంకటాచలం ప్రీమియర్ లీగ్(వీపీఎల్) క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన యువకులు ఐకమత్యంతో వీపీఎల్ క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడు తాయన్నారు. యువత చెడు వ్యవసనాలకు స్వస్తి చెప్పి, సమయం దొరికినప్పుడు క్రీడల్లో పాల్గొనాలన్నారు.

జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలి



అమృత కలశంతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మనుబోలు: ప్రతిఒక్కరూ దేశభక్తి, జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. నా భూమి, నా దేశం కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం నుంచి అమృత కలశంతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజల్లో జాతీయ భావాన్ని, దేశభక్తిని పెంపొందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నా భూమి, నా దేశం కార్యక్రమాన్ని చేపట్టాయని వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రధాని చెప్పిన ఐదు సూత్రాలను పాటించి భారత దేశాన్ని ప్రపంచంలో విశ్వ గురువుగా నిలిపేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అమృత కలశ యాత్రలో భాగంగా మండలంలో సేకరించి మట్టి, బియ్యాన్ని ఢిల్లీకి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ రవికుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు కృష్ణవేణి, పద్మ, మంజుల, రేష్మసోని, శీనయ్య, రాజా, చెంచుప్రసాద్, అంకబాబు, సునంద, ఐసీడీయస్ సూపర్‌వైజర్ రమణమ్మ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



ముత్తుకూరు: పేద మహిళల ఆర్థికాభివృద్ధే తమ సంస్థ ధ్యేయమని ఆదాని ఫౌండేషన్ సదరన్ రీజనల్ సీఎస్సార్ హెడ్ అనిల్‌బాలకృష్ణన్ పేర్కొన్నారు. ఆదాని కృష్ణపట్నంపోర్టులో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఒక్క రోజు ఎక్స్‌పోను శుక్రవారం నిర్వహించారు. పోర్టు కార్పొరేట్ వ్యవహారాల హెడ్ వేణుగోపాల్‌తో కలసి అనిల్‌బాలకృష్ణన్ మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ఫౌండేషన్ సహకరిస్తుందన్నారు. ఉత్పత్తుల మార్కెటింగ్‌కు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్‌రంజన్, గంగాసతీష్, శ్రీనివాసులు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

పార్క్ అభివృద్ధి పనుల పరిశీలన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని బెజవాడ గోపాల్‌రెడ్డి పార్క్ అభివృద్ధి పనులను నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎం సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పార్క్‌లో చేపడుతున్న పనులపై కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. అనంతరం చైర్‌పర్సన్ సుప్రజ మాట్లాడుతూ పార్క్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పార్క్ అభివృద్ధి పనులకు రూ.కోటి మంజూరు చేసిన ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కౌన్సిలర్లు జయంతి, అనంతమ్మ, ప్రమీల, నాయకులు సీహెచ్ సురేష్, ఇలియాజ్, బీ సురేష్, అల్లాభక్షు, ఏఈ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సహకార బ్యాంక్ మేనేజర్‌కు చెక్కు అందజేస్తున్న నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి పేర్కొన్నారు. 2022 రబీ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తోలిన 966 మంది రైతులకు హమాలీ ఖర్చుల కింద ప్రభుత్వం రూ.24,64,650 మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన చెక్కులను పడుగుపాడు సొసైటీ కార్యాలయంలో కోవూరు సహకార బ్యాంక్ మేనేజర్ సుధాకర్‌కు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డితో కలిసి డీఏఏబీ చైర్మన్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌బాబురెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి ఆశించిన మేర చొరవ చూపిన దాఖలాలు లేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధరలు అందజేస్తుందన్నారు. సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ సొసైటీకి సంబంధించి ఇనమడుగులోని పాత గోడాము శిథిలావస్థకు చేరడంతో ఆ ప్రాంతంలో నూతనంగా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. పాత గోదాము భవనం తొలగింపు, ఫర్నిచర్‌కు ఈ నెల 30లోగా టెండర్లు ఆహ్వానించనున్నట్లు చెప్పారు. వచ్చిన టెండర్లను అదేరోజు ఫైనల్ చేస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి, మేనేజర్ ఎస్ స్వప్న, శివకుమార్‌రెడ్డి, కే ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



మనుబోలు: మండలంలోని అప్పయ్యగేటు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. మనుబోలుకు చెందిన కసుమూరు రామసుబ్బారెడ్డి స్కూటీపై నెల్లూరు వెళ్లి తిరిగి వస్తున్నాడు. అప్పయ్య గేటు సమీపంలోకి రాగానే స్కూటీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



చాముండేశ్వరీదేవి అలంకారం



అన్నపూర్ణాదేవి అలంకారం

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయం వద్ద చాముండేశ్వరీదేవి, దసరా చావిడి వద్ద అన్నపూర్ణాదేవి, మనుబోలులోని దసరా చావిడి వద్ద మహంకాళి అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు.

అవినీతిని అరికడితేనే నిజమైన అభివృద్ధి



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

మనుబోలు: సమాజంలో పేరుకుపోయిన అవినీతికి అడ్డుకట్ట వేస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమని కాగితాలపూరు రోడ్డులోని 400 కేవీ పవర్ గ్రిడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రావు పేర్కొన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కాగితాలపూరులో అవినీతి నిర్మూలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని వివిధ వ్యవస్థల్లో వేళ్లూనుకుపోయిన అవినీతి మూలంగా అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడితే ఎలా ఫిర్యాదు చేయాలో వివరించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారని తెలిపారు. అవినీతి పెచ్చుమీరితే దేశం అధోగతి పాలవుతుందన్నారు. అవినీతి నిర్మూలనను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ ఐ శ్రీకృష్ణ, హెచ్‌ఆర్ జితేంద్ర బెహరా తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం



కోవూరులో కళ్ల అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కోవూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పాటూరు ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వైద్యనిపుణులతో ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు అందజేస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైఎస్సార్ కంటి వెలుగు కింద పరీక్షలు చేయించుకున్న వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. వైస్‌ఎంపీపీ నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, ఎంపీడీఓ శ్రీహరి, వడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్ మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీటీసీ విజయసేనారెడ్డి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

624 మందికి వైద్య పరీక్షలు

కొడవలూరు: మండలంలోని మిక్కిలింపేటలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. 624 మంది వైద్యపరీక్షలు చేయించుకుని మందులు స్వీకరించారు. ఎముకలు, కీళ్లకు సంబంధించి 128, కంటికి సంబంధించి 151, ఇతర ఆరోగ్య సమస్యలపై 345 మంది వైద్య సేవలు పొందారు. వీరిలో పలువురికి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారు. వైద్యనిపుణులు కీర్తిక, శశికళ, నిఖిల్, పీహెచ్‌సీ వైద్యులు పీ లత, పీ కావ్య, ఎం రామకృష్ణ వైద్య సేవలందించారు. ఈఓపీఆర్డీ డేవిడ్, సర్పంచ్ మారంరెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు జుటూరు వెంకటకృష్ణారెడ్డి, కార్యదర్శి మధు పాల్గొన్నారు.

నేడు కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న పర్యటన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పర్యటించనున్నట్లు బుచ్చిరెడ్డిపాళెం టౌన్, రూరల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు టీ మల్లారెడ్డి, సీహెచ్ సతీష్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాదీమంజిల్‌లో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీటీడీ సహకారంతో 38 దేవస్థానాల నిర్మాణం



విడవలూరు: దండిగుంటలో కలశాలను తీసుకొస్తున్న గ్రామస్తులు



జమ్మిపాళెంలో కోదండరామాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు: తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో కోవూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 38 దేవస్థానాల నిర్మాణం చేపట్టినట్లు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జమ్మిపాళెంలో టీటీడీ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు దేవాలయాల నిర్మాణానికి టీటీడీ రూ.10 లక్షల వంతున మంజూరు చేస్తోందని, అవి సరిపోకపోవడంతో నిర్మాణ పనులు మధ్యలో ఆగుతున్నాయన్నారు. అలా కాకుండా పూర్తిస్థాయిలో ఆలయ నిర్మాణానికి రూ.20 లక్షలు అవసరమవుతాయన్నారు. ఈ విషయాన్ని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు టీటీడీ ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మాత్రమే దేవస్థానాల నిర్మాణం చేపడుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గ్రామాలకు వెళ్లినప్పుడు బీసీ కాలనీల్లోనూ ఆలయాలు నిర్మించాలని ప్రజలు కోరారన్నారు. ఈ విషయాన్ని టీటీడీ చైర్మన్ దృష్టికి తీసుకెళతామన్నారు. అనంతరం గ్రామంలోని పొదుపు సభ్యులకు వైఎస్సార్ ఆసరా కింద రూ.5.25 లక్షల చెక్కును అందజేశారు. గ్రామంలో డ్రెయిన్ల నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ.12 లక్షలు మంజూరు చేసిన జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలతను ఎమ్మెల్యే అభినందించారు. డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, డీఏల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, సర్పంచ్ ప్రమీలమ్మ, సచివాలయాల మండల కన్వీనర్ ప్రసాద్, నాయకులు మీరారెడ్డి, వెంకటేశ్వర్లు, రమేష్, వెంకయ్య పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహప్రతిష్ఠ

విడవలూరు: మండలంలోని దండిగుంటలో టీటీడీ, స్థానిక దాతల సహకారంతో నిర్మించిన కోదండరామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయంలో గ్రానైట్ పరిచేందుకు రూ.లక్ష, దండిగుంట ఎస్టీ కాలనీలోని ఇళ్ల మరమ్మతులకు ఇంటికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.40 లక్షలను తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా అందజేస్తామని తెలిపారు. అనంతరం స్థానిక నాయకుడు బెల్లంకొండ శ్రీధర్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సహకారం అందించిన ఎమ్మెల్యే ప్రసన్నకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల లక్షయ్య, పార్టీ మండలాధ్యక్షుడు బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, దండిగుంట, వరిణి సర్పంచ్‌లు సుప్రజ, మల్లికార్జున, నాయకులు నాగేశ్వరావు, సురేందర్‌రెడ్డి, నారాయణ, తిరుపతయ్య, వాసు, మస్తానయ్య, రత్నం, జనార్దన్, శ్రీనివాసులు, పోలయ్య పాల్గొన్నారు.